# తుఫానులో రాలిన జీర్ణపత్రాలు

'ఏమోయ్ రాఘవేంద్రం! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి — క్షేమమా?' అన్నాను. తలవని తలంపుగా కారుస్టాండు దగ్గర గంగరావిచెట్టు క్రింద మొక్కజొన్న పొత్తు తింటూ కనిపించాడు వాడు. నన్ను చూసీ చూడ్డంతోటే వాడి కళ్ళు జిగేల్ మన్నాయి.

'అబ్బా— నిన్నుచూసి ఎన్నాళ్ళయింది?'' అన్నాడు. ఆప్యాయంగా గాఢంగా కౌగిలించుకున్నాడు.

'అబ్బొ— చాలా రోజులయింది. మూడేళ్ళయిందను కుంటాను. ఆవేళ నేను బెజవాడ పోతూవుండగా నువ్వూ నేనూ ఒకే కేరేజ్‌లో ప్రయాణం చేశాం. మనతో సాహు కారు సుబ్రహ్మణ్యం కూడా ఉన్నాడు. జ్ఞాపకం ఉందా? అన్నాను.

‘ఆఁ–ఔనౌను. జ్ఞాపకం వచ్చింది. నువ్వు మరచిపోలేదే!’

‘ఇంతట్లోనే మరచిపోవాలా? పైగా నిన్ను చరితార్థుణ్ణి చేశాను కూడా. సరే. మీవాళ్ళంతా క్షేమమేకదా’

‘ఆఁ’

అన్నాడేగాని రాఘవేంద్రం ముఖం అదోమాదిరిగా, ఇబ్బందిగా మారిపోయింది. పడమటి ఆకాశపు శూన్యంలోకి చూస్తూ పరధ్యానంగా ఉండిపోయాడు. పడమటి ఆకాశం జేగురురంగు పులుముకుంది. సూర్యుడు అలసిన గుర్రంలాగ ఒగురుస్తున్నాడు. దూర దిగంతాలలోని తాటిచెట్లు సైతం నల్లగా అందంగా కనిపిస్తున్నాయి. ప్రబలమైన ఆకారాలతో ఉన్నతంగా ఠీవిగా నిల్చున్నాయి. క్షణక్షణానికి పరివర్తన మవుతున్న లోకాన్ని ధ్యానమగ్నంగా పరికిస్తున్నాయి.

అలాంటి మార్పు అంత అకస్మాత్తుగా అతనిలో ఎందుకు కలిగిందో నా కర్థంకాలేదు. ఎందుకేనా మంచిదని ‘మీ అమ్మాయి బాగుందా? నీభార్య క్షేమమేనా?’ అని ప్రశ్నించాను. ఇంకా ఏవేవో సమయోచిత కుశలప్రశ్నలడుగుదామని ఆలోచిస్తున్నాను. ఇంకా నాఆలోచనలు పూర్తికానేలేదు. ఈ లోగానే రాఘవేంద్రం చేతులు రెండూ నా గొంతు పట్టుకున్నాయి. కంఠం క్రమేపీ హెచ్చుతూ ఆఖరికి భోరున ఏడ్వ

టం ప్రారంభించాడు. మేమున్నది ఇల్లు కాదని, కనీసం ఏకాంత స్థలమైనా కాదనీ, అది కేవలం పదిమందీ పోగుపడే కారుస్టాండనీ వాడు గుర్తించే స్థితిలో లేడు. పైగా నా మెడకు చుట్టిన చేతుల్ని వదలడంగాని, ఏడుపు ఆపి సంగతేమిటో చెప్పడం కాని తన కర్తవ్యాలనే విషయం వాడి స్మారకంలో లేదు. వెక్కి-వెక్కి ఏడుస్తున్నాడు. దుఃఖస్థాయి హెచ్చుతున్నకొద్దీ నా మెడకు కట్టిన చేతులు మరింత బిగుసుకు పోతున్నాయి. అతని దుఃఖాన్ని ఉపశమింప చేయడంకంటె ఆ బంధాలనుంచి విముక్తుణ్ని కావడమే నా తక్షణ కర్తవ్యమయింది. అయినా ఓపిక పట్టాను.

'అదేమిటి రాఘువేంద్ర? మరీ చిన్నపిల్లవాడిలాగ ... అసలు సంగతేమిటి? చెప్పకుండా ఏడిస్తే ఏందారి చెప్పు?' అన్నాను. నా కంఠంలో సాధ్యమైనంత గాఢంగా సానుభూతి నిబిడీకరించాను.

రాఘువేంద్రం దుఃఖం ఆగడానికి ప్రయత్నించింది. రుద్ధమైన కంఠంతో – మధ్య మధ్య అప్రయత్నంగా వచ్చే ఎక్కిళ్ళతో–యిలా అన్నాడు 'నా చిట్టితల్లి నీలవేణి అకస్మాత్తుగా చనిపోయింది. ఏం చెప్పను. నన్ను దురదృష్టవంతుణ్ని చేసేసింది. దాన్ని గురించి ఎన్ని ఆశలు పెట్టుకున్నాను! ఎన్ని గాలిమేడలు కట్టుకున్నాను! అది పుట్టింది మొదలు నా

ఆదాయం పెరుగుతూ వచ్చింది. నా ఆరోగ్యం బాగుపడింది. నాభార్యకీ—నాకూ మధ్య అనురాగం గాఢతరమైంది. కాని నా బంగారు తల్లి నాకు దక్కలేదు, అని బరువుగా నిట్టూర్చాడు.

నాకు తెలుసు; దుఃఖం. హృదయా వేదనకు విముక్తి మార్గం—నిట్టూర్పుల హృదయానల కీలలు క్రమ్మే పొగలు! అంచాతనే అన్నాను 'అయ్యో పాపం! విధి ఎంత క్రూరమైంది వైరినాయనా! తల్లి దండ్రుల్ని బాధల పాల్జేయడానికేనా పిల్లలు కలగడం?

'నిజం; దేవుడికి ఎంత ద్వేషమో దీన్నిబట్టి రుజువౌతోంది. ఏదో కష్టపడి నాలుగు రాళ్ళు సంపాదించుకొంటున్నాను. నా బ్రతుకేదో నేను బ్రతుకుతున్నాను. ఎవళ్ళకి అన్యాయం చేసి ఎరుగనే అయినా చూడు నాకీ కష్టాలు' అన్నాడు రాఘవేంద్రం నింపాదిగా తాపీగా. గంధకంలోంచి వచ్చే మంటలవలె ఉన్నాయా మాటలు.

'కాని ఏంచేస్తాం చెప్పు? దుఃఖం దిగ మ్రింగుకుని ఎలాగో బ్రతకాలి తప్పితే—మన చేతుల్లో ఏముంది గనక?' అన్నాను. ఈ అనునయ వాక్యాల్ని హృదయంతో ఉచ్చరించాను. మామూలు పరామర్శవాక్యాల్ని వెల్లడించే లౌకిక వాదిగా గాక—కష్టంలో ఉన్న ఒక మిత్రుడికి సానుభూతి చూపే నిజమైన స్నేహితునివలె ఓదార్చాను.

కాని రాఘవేంద్రం దుఃఖం ఉపశమించలేదు. పైగా మరింత రెచ్చిపోయింది. మళ్ళీ మరో దుఃఖపు తెర అతని కంఠాన్ని ఆక్రమించి స్పష్టతను మరుగుపరచింది. ఆధోరణిలోనే అతను మళ్ళీ చెప్ప నారంభించాడు. 'నా కన్నతల్లి తెలివి తేటల్ని చూసి ఉప్పొంగి పోయేవాణ్ని...ఎంతో విద్యావంతు రాలవుతుందని ప్రతి నిత్యం ఆనందించేవాణ్ని. దానికి సంగీతం నేర్పించాలనీ, భరతనాట్యం నేర్పించాలనీ కలలు కనేవాణ్ని. ఇంతకీ నాకదృష్టం లేదు. ఏం చేయను చెప్పు?'' అని.

అతని దుఃఖగాథ వింటూంటే నాకొక్కటే అనిపించింది. ఎలాంటి మనిషికైనా ఆశ బలమైన ఆసరా. నిజానికి ఏభయి రూపాయల నెలవారీ జీవిత పరిమాణం గలవాడైనప్పటికీ రాఘవేంద్రం తన కూతుర్ని విద్యావంతురాల్ని చేదామనీ, గొప్పదాన్నిగా తయారుచేదామనీ ఆశించడంలో అసందర్భం గాని, అనారోగ్యంకాని లేదు. అయితే ఎంతవరకు సాధ్యం అనేది వేరే విషయం. సమాజంలో తనవంటి వ్యక్తు లనేక మంది రోజురోజుకీ చెడ్డనుంచి మరీ చెడ్డకి దిగజారిపోతున్నప్పటికీ తన సంతానమైనా, మంచినుంచి మరీ మంచికి ఎగబ్రాకు తారని ఆశించడం దురాశకాదుకదా! అనుకున్నాను.

'సరే రాఘవేంద్రం! నీ భార్య ఆరోగ్యంగా ఉందా' అన్నాను. ఈ ప్రశ్నతోనైనా వాడు విచారంనుంచి తెప్పరిల్లు

తాడనుకన్నాను. దుఃఖభారాలనుంచి బైటపడి లౌకిక ప్రపంచ పరిసరాల్లో మళ్లీ ఊపిరి పీల్చుకుంటాడని ఆశించాను. అంతే మరేవిధమైన దురుద్దేశమూ లేదు. పైగా ఆ ప్రశ్న వాడిలో మరింత ఆందోళన లేవదీస్తుందని ఏవిధంగా అంచనా వేయ గలను? కేవలం యథాలాపంగా అడిగాను.

రాఘవేంద్రం హృదయం శోకలిపోటు తిన్న గోరు చుట్టులా తయారైంది. ఏవో అజ్ఞాత విచారాల వికారాన్ని ముఖంమీదికి ప్రసరింప చేసిందా ప్రశ్న. పైగా ఏదో నేరం చేసిన వ్యక్తి తాలూకు మనోభావాల్ని రాఘవేంద్రం ముఖం ప్రతిఫలించింది. సూటిగా నా ప్రశ్నకు ప్రత్యుత్తరం సమాధాన మీయలేదు.

అనుమానంగానే అన్నాను. 'మాట్లాడవేం? ఏమిటి సంగతి! అందులో నాకు చెప్పకుండా దాయాల్సిన సంగతే ముంది?' అని.

రాఘవేంద్రం ఏడుపు ఎక్కిళ్ళను దిగమ్రింగుకున్నాడు. కంఠం సవరించుకున్నాడు. ఉత్తరీయంతో ముఖం తుడుచు కున్నాడు. క్రాపు సర్దుకున్నాడు. జేబులోంచి బీడీ తీసి ముని పళ్ళతో నొక్కిపట్టాడు. "అబ్బే చెప్పడానికేమీ అభ్యంతరం లేదు. మనసిచ్చి మాట్లాడే నీవంటి మిత్రునితో చెప్పకపోతే, ఇంకెవరితో చెప్పగలను? అగ్గిపెట్టె వుందా?' అన్నాడు.

జేబులోంచి సిగరెట్టు పాకెట్టు— అగ్గిపెట్టె తీశాను. నేనో సిగరెట్టు తీసుకున్నాను. 'ఇదిగో యిది కాల్చు' అంటూ పెట్టె చేతికిచ్చాను. నా సిగరెట్టు కాల్చడానికి ఏమభ్యంతర పడ్డాడో ఏమో 'తర్వాత కాలుస్తాలే ఇది వుందిగా' అన్నాడు. అగ్గిపుల్ల గీసి యిద్దరం వెలిగించుకున్నాం. 'సరే ఇలా నించోడమెందుకు అలా వెళ్ళి పార్కులో కూర్చుందాం' అన్నాను.

అతను నా కోరికను తృణీకరించలేదు. ఇద్దరం నడుస్తున్నాం. నే నేదేదో ఆలోచించుకుంటున్నాను. అంతూపంతూ లేని ఆలోచనా సాగరంలో తపతప కొట్టుకుంటున్నట్టుంది వాడి ముఖం. భార్య క్షేమం పృచ్ఛించగానే వాడి ముఖం అలా ఎందుకు మారిందో, వెంటనే ఎందుకు సమాధానం చెప్పలేకపోయాడో— ఎంత ఊహిద్దామనుకున్నా బోధపడలేదు. పాపం, ఆమె చనిపోయిందా! లేక ఎవరితోనైనా లేచిపోయిందా!! ఛా, అమంగళాల నెందుకు అంచనావేయాలి?

పార్కులో ప్రవేశించాం. మనుషులెవ్వరూ లేని ఒక మూలకు నడిచాం. మెత్తని పచ్చగడ్డిమీద చతికలపడ్డాం. నేను చుట్టూ కలయజూస్తూ పొగ పీలుస్తున్నాను. బోగన్ విలియా పూవులు గుత్తులు గుత్తులుగా పూచి, చిలిపిగా వూగిసలాడుతూ వ్రేలాడుతున్నాయి. ప్రక్కనున్న రోడ్డు మీంచి పశువులమందలు ఇళ్ళకుపోతూ దుమ్ము రేపుతున్నాయి.

ఆకాశంమీద గౌరవర్ణం ఆక్రమించింది. మేము కూర్చున్న గడ్డినుంచి మిడతలు తుప్పు తుప్పున తూలుతున్నాయి.

రాఘవేంద్రం బీడీపొగ గట్టిగా దమ్ముపట్టాడు. వదులుతూ యిలా అన్నాడు. 'నాభార్య కాపురానికి వచ్చిన నాలుగేళ్ళవరకూ చీకూ చింతా లేకుండా, పోరూపొకూ లేకుండా ఒకే శరీరంగా బ్రతికేమంటే నమ్ము. అకస్మాత్తుగా నా కూతురు పోయిందా! అంతే—ఒక్కొక్కటే నాకన్నీ దురదృష్టాలూ దాపురించాయి. నా బిడ్డపోయిన తర్వాత మా మామగారు వచ్చి నాభార్యను తమ యింటికి తీసుకువెళ్ళారు. నేనేమీ అభ్యంతరం పెట్టలేదు. "సెలవు దొరకగానే నువ్వొకసారి రావోయ్. పదిరోజులుండి వచ్చేద్దువుగాని అన్నారాయన" ఆగాడు. బీడీ ఆఖరి దమ్ము లాగి విసిరేసాడు. నేనేదో ఆలోచనలో పడ్డాను. వాడు మళ్ళీ అంటున్నాడు.

"కాని నేను సెలవు కోసం ప్రయత్నించనూ లేదు; అక్కడికి వెళదామని అనుకోనూ లేదు. పదిరోజులుపోయిన తర్వాత మామగారికో ఉత్తరం మాత్రం రాసాను. నాపెళ్ళినాడు ఆయన, వెయ్యిరూపాయలు కట్నం యిస్తానని వాగ్దానం చేసాడు. వివాహమై సుమారు ఐదేళ్ళయినా ఆ డబ్బు విషయం ఎన్ని దఫాలడిగినా 'అదిగో యిదిగో' అని కాలయాపన చేస్తున్నారు. ఈమాటు అమీ తుమీ తేల్చుకోవా

లనుకున్నాను. అంచాతనే ఆయనకు వ్రాసిన ఉత్తరంలో నాకు మీ రివ్వాల్సిన డబ్బు తక్షణం అణాపైసలతో తెచ్చి నాకిచ్చిన రోజునే మీఅమ్మాయి కాపురానికి వస్తుంది! అంత వరకూ అక్కడే అట్టేపెట్టుకోండి, అని వ్రాసాను' అన్నాడు రాఘువేంద్రం. ఎంతపని చేసాడు; అవును మగవీరుడు మరి!

నేనేమీ మాట్లాడలేదు. జాగ్రత్తగానే వింటున్నాను. రాఘువేంద్రం నుంచి దృష్టి మరల్చుకొంటున్నాను. ముందు కాళ్లు రెండూ పుట్టుకలోనే వంగిపోయి, చాలా కష్టపడి నడుస్తున్న ఆబోతు పులిస్తారికులు తింటోంది. ఎవరో కాలేజీ అమ్మాయిల కోసం బేరం వప్పుకోవడంలో పోటీలుపడి, ఆఖరికి బూతులు కూసుకుంటున్నారు రిక్షావాళ్ళు. కళ్ళు తుడుచు కుంటున్న రాఘువేంద్రం తుళ్ళిపడి గొంతుక సవరించు కున్నాడు.

'ఏమయింది? ఆయన వెంటనే సమాధానం రాశాడు; నా కుటుంబ పరిస్థితులు ఎరుగుండీకూడా నువ్విలా నన్ను పదే పదే ఇబ్బంది పెట్టడం నీకు భావ్యమా? ఏదైనా మార్చి ఎలాగో సర్దుకొని నీ కిచ్చేయలేకపోతానా అని అప్పట్లో నీకా వాగ్దానం యిచ్చినమాట వాస్తవమే. కాని ఏంచేయను? నా దారిద్ర్యానికి నేనే సిగ్గుపడి, చావలేక బ్రతుకుతున్నాను. తలేనా తాకట్టుపెట్టి ఎప్పటికైనా ఇచ్చితీర్తాను. కాకనేకాదు,

నీ భార్యను కాపురానికే తీసుకువెళ్ళనంటావా ? ఏం చేస్తాం ? అదీ మాతోపాటే ఏ గంజో కడుగో తాగి యిక్కడే పడుం టుంది'' అని ఖచ్చితంగా వ్రాశారు. ఏం చేయను ? అనుక్క ఆయన నోరారా అనిపించుకుని కూడా ఏముఖం పెట్టుకొని నా భార్యను తీసుకురాగలను ? మళ్ళీ వెళ్ళడానికి నా ముఖం చెల్లలేదు. కాని నిజంగా— నా భార్యలేని యిల్లు నరకంలా కనిపించేది. ఇంటికి రాగానే కాళ్ళు, ముఖం కడుక్కోమని నీళ్ళందించే భార్య— తువ్వాలు పట్టుకొని, గుమ్మాన్ని ఆనుకుని చిరునవ్వు ముఖంతో నిరీక్షించే యిల్లాలు— నాకు గభాలున జ్ఞాపకం వచ్చేవి. 'నాన్నా—నాన్నా' అంటూ చేతులందించే నా బిడ్డ గుర్తుకొచ్చి, ఏదో గాభరా కలిగేది. అయినా కనీసం నేనన్నమాటనైనా నిలుపుకోకుండా కుక్కలా మళ్ళీ దాన్ని తీసుకురానేలేను. మా అమ్మమ్మని తెచ్చుకుని అలాగే బ్రతుకుతున్నాం...' అన్నాడు రాఘవేంద్రం. దుఃఖం, వాడి కంఠాన్ని గట్టిగా పిసికేస్తోంది. గుడ్లు నీళ్ళు కక్కుతున్నాయి.

గాలి బలంగా వీచుతోంది. నా సులోచనాల క్రిందికి సైతం తన సున్నితమైన వేళ్లను జొనిపి నా కనురెప్పలపై కితకితలు పెడుతోంది. వాడి పశ్చాత్తాపూర్వక విషయాలు విం టూంటే ఉబ్బెత్తుగా నాకళ్ళముందు ఎన్ని మానవస్వరూపాలు నించున్నాయని! నాగుల సీతారామయ్య! జోస్యుల వెంకట రమణమూర్తి! ఆళ్ళ పార్వతీశం!... వగైరా లెంతమందో!

అనామకులు ఒక్కసారిగా ప్రత్యక్షమయ్యారు. అప్పుడుమరి-పౌరుషం కోసం హృదయాన్ని తఖా ఇచ్చుకుంటున్నది ఆచంట రాఘవేంద్రం ఒక్కడేనా ? ఇదే పరిస్థితిలో ఎంతమంది అసహాయకులు అనునిత్యం సతమతమవడంలేదు ? అయితే మాత్రం నువ్వూ-నేనూ, అతడూ-ఆమె ఇంతమందిమీ కలిసి ఏం చేయగల్గుతున్నాం ?

రాఘవేంద్రం చెప్పడం మానలేదు. 'నా కారోజున నువ్వు కనిపించిన నాటికి ఎంతో సంతోషంగా, గర్వంగా గడుపుతున్నాను. చూడు-మళ్లీ నువ్వే కనిపించేసరికి పకీరుగా మారి, ఆత్మహత్య చేసుకుని చావడమా లేక బికారిలాగ అడుక్కు తింటూ బ్రతకడమా- అనే చిక్కు సమస్య తేలక ఏడుస్తున్నాను. కష్టాలెప్పటికేనా గట్టెక్కక పోతాయా, మామగారు రాజీకి రాకపోతారా, స్వయంగా నా భార్యను దిగబెట్టకపోతారా, అని వెర్రి ఆశలతో కాలం దొర్లిస్తున్నాను. తీరా నా దగ్గరకు వస్తే నేనేమైనా అవమానం చేస్తానేమో అనే అనుమానంతో, ఆత్మాభిమానంతో ఆయన రావడంలేదు కాబోలు !' అన్నాడు. వెంటనే ఏదో ఆలోచనలో పడ్డాడు. నిజానికి నేనుకూడా పరధ్యాన్నంలో పడ్డాను. రాఘవేంద్రం భార్యగురించి ఆలోచిస్తున్నాను. పోనీ ఆమె అయినా తన తండ్రితో నిమిత్తంలేకుండా తన భర్త దగ్గరికి వచ్చేయకూడదా? అనుకున్నాను. ఆమాత్రం సాహసం ఉన్నవాళ్ళు నాటికి

ఎంతమంది? పతివ్రతల దేశంలో ఆడదానికి ఆ జ్ఞానం ఎక్కణ్ణించి వస్తుంది? ఏ ఒక్క సోమేశ్వరరావు భార్యవంటిదో తప్ప తండ్రిమాట కాదనగలదా?

గభాలున తెరుచుకున్న రాఘవేంద్రం కంఠం నా ఆలోచన కంతరాయం కలిగించింది. వాడంటున్నాడు 'సరే, ఇంతటితోనైనా నా కష్టాలు ఆగితే ఎంత బావుండును? కాని ఒకొక్కటే వస్తే— నిజానికి మానవుణ్ని కష్టాలేమీ చేయలేవు. అంచాతనే కాబోలు—ఒంటరిగా రావు. చిత్రంచూశావా! సంతోషం, సుఖం లభించేసరికి మనిషి గర్వంగా ప్రపంచం అంతా తన మాటపైనే నడుస్తున్నట్టు భావిస్తాడు. కాని కష్టాలు విచారాలు సంభవించేసరికి ఏ పాతాళంలోకానికో దిగతొక్కబడ్డట్టూ అంతా తన్ను చూసి అసహ్యించుకున్నట్లూ భావిస్తాడు' అన్నాడు రాఘవేంద్రం.

ఆఖరున వాడన్న ఈ మాటలకు నేనమితంగా ఆశ్చర్యపోయాను. నైపుణ్యం లేని కథలోకూడా— రాఘవేంద్రాన్ని పోలిన పాత్రసైతం ఇంత గొప్పవాక్యాన్ని ఉచ్చరిస్తుందన్నా విశ్వసించలేను. జీవితాన్ని పూర్తిగా కాచివడబోసిన తత్త్వవేత్తల ఆత్మ— రాఘవేంద్రం కళ్ళల్లో ప్రకాశించింది. అనుభవంలోకి వస్తేనేగాని తత్వం బోధపడదేమో!

మాచుట్టుపట్ల— లోకమంతట్లా దీపాలు వెలిగాయి. ప్రకాశవంతమైన కాంతులు వెదజల్లాయి. మేము మాత్రం

చీకటి క్రీనీడల్లో కూర్చున్నాం. రాఘవేంద్రంలో మళ్ళీ ఉద్రేకం హెచ్చింది. విచారం ఒక్కసారిగా ప్రక్కకు తప్పు కుంది. వాన కురిసి వెలిసిన ఆకాశంలాగ స్వచ్ఛంగా మెరు స్తోంది అతనిముఖం. వాడు చెబుతున్నాడు 'ఎవరో కొందరు గుమాస్తాలు నన్నుచూసి ఈర్ష్యపడుతూండటం నాకు మొద ట్నుంచీ తెలుసు. కాని వాళ్ళేం చేయగల రనుకొనేవాణ్ణి. ఎవళ్ళనీ లక్ష్యపెట్టలేదు. ఆమధ్య రోడ్డుకంట్రాక్టరు కోటేశ్వర రావు నాయుడుగారు టెండర్లకోసం ప్రయత్నించారు. ఆయన పొందారు కూడా. అయితే— ఆయనదగ్గర్నుంచి నూరు రూపా యలు లంచం పుచ్చుకున్నానని గుమాస్తాలు పుకారు లేవ దీశారు. వూళ్ళో కొందరు పెద్దమనుష్యుల సాక్ష్యంతో సహా వాళ్ళంతా నామీద రిపోర్టుచేసారు, లేదని నేనెంత నెత్తినోరు మొత్తుకున్నా ఎవళ్ళూ వినిపించుకోలేదు. నానేరం రుజువైంది. మున్సిపాలిటీ ఛైర్మన్‌గారు నోటీసిచ్చారు. నన్ను ఉద్యోగం లోంచి బర్తరఫ్ చేశారు. నెల్లాళ్ళయింది. ఏంచేయను చెప్పు?' అంటూ గొల్లుమన్నాడు రాఘవేంద్రం.

'పోనీలే వెధవ నౌఖిరీ— ఇంతకంటె మంచిది సంపాదించు కోలేకపోతావా ?— మళ్ళీ నువ్వేం ప్రయత్నించలేదు మరి ?'' అన్నాను. వాడి దుఃఖాన్ని చూసి సహించలేక, ఊరుకోలేక- ఊరుకో! వెడదామని ఆఖరి ప్రయత్నం చేశాను.

అలాగే మళ్ళీ మాటందుకున్నాడు రాఘవేంద్రం : "నాపయి రిపోర్టుచేసిన వాళ్ళలో– అనేకసార్లు నాకంటె హెచ్చుమొత్తాలు కొట్టేసిన పెద్దగుమాస్తాలుకూడా ఉన్నారు. అదృష్టవంతుల్ని ఎవళ్ళయితేమాత్రం ఏంచేయగలరు ? ఇంతకీ నా దురదృష్టం అలాంటిది– అంతే!" అంటూ ముఖం తుడుచుకున్నాడు రాఘవేంద్రం–

లంచగొండి బాగానే శిక్షింపబడ్డాడనే సంతోషంతో పొంగిపోవాలో–పాపం రాఘవేంద్రం కష్టాల్లో చిక్కుకున్నాడనే విచారంతో కృంగిపోవాలో నాకు యిప్పటికీ బోధపడలేదు. ♦♦

రచన పరిచరణ – ఢంకా పక్షపత్రిక ఆగస్టు 1954